# ఆత్మప్రేమ

అద్దం కావిలించుకు నుంచుని అదే పనిగా చూసుకుంటున్న అమ్మాయి. ఆటే అందంగా లేదుత. ముక్కు ఉండదగిన దానికన్న ఎత్తుగా ఉంది. గడ్డం వెనక్కు తోసుకుపోయింది. కళ్లు గుంటకళ్లు.

"అద్దంలో ఏముంది? అంతగా చూట్టానికి?" అన్నాను.

"నేనున్నాగా? ఇంకేం ఉండాలి?" అన్నది నాకేసి చూడుకుండానే.

దీని అంతేమిటో తెలుసుకోవాలనిపించింది.

"నిన్ను నువ్వెంత సేపని చూసుకుంటావు? ఇంకా అందమైనదేమైనా ప్రపంచంలో ఉందేమో తెలుసుకోవటానికి ప్రయత్నించరాదా? కళ్లున్నందుకు ఫలితమేమిటి?" అన్నాను.

"నా కన్న అందమైనదేదీ ప్రపంచంలో లేదు."

"ఆ సంగతి నీకెట్లా తెలుస్తుంది? అద్దంలోకి చూసి అదే ప్రపంచమనుకుంటున్నావు."

"నాకు లేని దుగ్ధ నీకెందుకు? అద్దంలో చూసుకుంటే నాకు సంపూర్ణమైన అనందం కలుగుతున్నప్పుడు నేను ఇంకో వేపెందుకు చూడాలి?"

"ఇంకా ఎక్కువైన ఆనందం కూడా ఉందేమో తెలుసుకునేటందుకు! ఉంటే ఉందనీ, లేకపోతే లేదనీ జ్ఞానం సంపాదించుకునేందుకు."

"నాకు జ్ఞానం అక్కర్లేదు."

"నువ్వంత మూర్ఖిస్తున్నావు గనక నిజం చెప్పేస్తున్నాను. నువ్వేమీ అందంగా లేవు. నీ కన్న ఎంత అందమైన వాళ్లున్నారో తెలిస్తే నువు మళ్లీ అద్దం చూసుకోవు!"

ఈ మాట కొరడా దెబ్బల్లే తగిలినట్టుంది. జేవురించి వికారమైపోయిన మొహం కొంత సేపటికి నాకేసి తిప్పి, "ఎవరువాళ్లు - నాకంటె అందమైనవాళ్లు?" అన్నది.

"ఆ వెళుతున్న పనిమనిషి చూడు, నీ కంటె ఎంత అందంగా ఉందో!" అన్నాను.

కళ్లు చిట్లించి మొహం చిట్లించి, "నాకామనిషి ముక్కూ మొహమూ కూడా తెలియరావటం లేదు" అన్నది.

"చూశావా? నీ కళ్లెంత చెడిపోయినయ్యో! చత్వార్తం వచ్చి నీకు పది గజాల చూపు కూడా ఆనటంలేదు. కొంచెం ఉండు, ఆ మనిషిని దగ్గరకు పిలుస్తాను."

పనిమనిషి దగ్గిరికొచ్చి నా మొహంలో మొహం పెట్టి చూసి, "ఈ మనిషికి మిట్టకళ్లూ, అణిచేసిన ముక్కూ, కొట్టవచ్చే గడ్డమూనూ" అన్నది.

"పాపం, నువ్వితరులని నీ గద్ద ముక్కుతోనూ, గుంటకళ్లతోనూ, ఈడుచుకు పోయిన గడ్డంతోనూ పోలుస్తున్నావు. ఈ మనిషి మొహం ఎంతో తీరుగా ఉంది."

"తీరుగా ఉంటే తీరుగా ఉన్నట్టు నాకు కనిపించదేం?"

"ఇంకోరి తీరు ఆలోచించేపాటి ఆత్మవిస్మృతి నీకు రాకుండా ఉంది."

"ఎవరన్నా తాము అసహ్యంగా ఉన్నామనుకుని అందం కోసం వెతుకుతారా ఏం?"

"అందంగా లేమనుకుని వెతకం. ఉన్నామనుకునీ వెతకం. మా ప్రమేయం వదిలేసి నిర్లిప్తతతో అందం గురించి ముందుగా జ్ఞానం సంపాదిస్తాం. తరవాత ఆ జ్ఞానం ప్రకారం ఇతర్లనీ కొలుస్తాం. మమ్మల్నీ కొలుచుకుంటాం."

"అయితే అటువంటి జ్ఞానం నా కదివరకే ఉంది. నేనే అందరికన్నా అందగత్తెని. అందుచేత మిగిలిన వాళ్లని నన్ను బట్టే కొలుస్తాను. కొలిచినా నా కన్న అందగత్తె లేదు గనక కొలవటం కూడా అనవసరం. అందుకని ఆ పనే తలపెట్టలేదు."

"అందం గురించి నీకింత జ్ఞానం ఎట్లా వచ్చిందో నేను తెలుసుకోవచ్చా."

"మీ అందరికీ ఎట్లా వచ్చేదీ నేను తెలుసుకోవచ్చా?"

మళ్లీ అద్దం కావిలించుకుంటూ, "నా ఆనందం నాదే! ఇంకోళ్లతో నేనెందుకు పంచుకోవాలి?" అన్నది.

"అందరూ నీ వైఖరే అవలంబిస్తే ప్రపంచం ఏమవుతుందో ఆలోచించి" అన్నాను. కాని ఇంతలో నేనెక్కడ ఉన్నదీ చట్టున జ్ఞాపకం వచ్చింది.

***ముద్రణ : ఆనందవాణి, 31 డిసెంబర్ 1944***